క్లుప్తంగా

వైవీని కలిసిన ఎమ్మెల్యే కేపీ


వైవీకి బొకే అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కలిసి మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

36 వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం టౌన్: వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ బీమానాయక్‌తో పాటు 4గురు ఎస్సైలు, సుమారు 100 మంది పోలీసులు పట్టణ శివారులోని నివాస ప్రాంతాల్లో ఇంటింటినీ తనిఖీ చేశారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఎటువంటి డాక్యుమెంట్‌లు లేని 36 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించామని, కొన్ని క్లూస్ లభించాయని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు. తాళాలు వేసి పండగకు ఊరికి వెళ్లేవారు సమాచారం చెబితే ఆ ఇంటిపై నిఘా పెడతామన్నారు. ఎస్సైలు శశికుమార్, సువర్ణ, సుమన్, రాజేష్, మల్లేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్, పలువురు ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రై డే కార్యక్రమం పరిశీలన

పొదిలి: స్థానిక టైలర్స్ కాలనీలో జరుగుతున్న ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ పరిశీలించారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కార్యక్రమం ప్రతివారం తప్పనిసరిగా ఏదో ఒక ప్రాంతంలో నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ బ్రహ్మనందం, హెల్త్ సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పి చౌడేశ్వరి, ఏఎన్ఎం మాధవి, ఆశ కార్యకర్తలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కూడారై పూజ

యర్రగొండపాలెం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో జరుగుతున్న పూజల్లో భాగంగా శుక్రవారం స్థానిక రాములవారి గుడిలో కూడారై పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామచంద్రుడికి ఇష్టమైన ఈ పూజలో 108 పాత్రలలో ప్రసాదం నింపారు. సీత రామలక్ష్మణుల విగ్రహాలను తామర పూలతో అలంకరించారు. ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్ దంపతులు ఈ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

వెంకటేశ్వర స్వామికి శంకుచక్రాల బహూకరణ

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం పలు ఆభరణాలు అందాయి. జీవీ నాగశశికళాదేవి, సత్యనారాయణ దంపతులు వెండి శంకు చక్రాలను.. వెన్నా సుబ్బారావు, సుబ్బరత్నం దంపతులు వెండి వక్ష స్థలాన్ని.. పాల్వాది రాజు, సుజాత దంపతులు వెండి పాదాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, నిట్టూరి రమేష్‌లకు అందించగా, అర్చకులు అరుణ్‌కుమార్ చార్యులు పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు.

గోర్రీ కుంభ మేళా పోస్టర్ ఆవిష్కరణ

కంభం: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం గోర్రీ కుంభమేళా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ లక్ష్మీ నాయక్ మాట్లాడుతూ గిరిజన బంజారా సమాజంలో జరుగుతున్న మొట్టమొదటి కుంభ మేళా ఇదేనని ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని గోర్రీ తండాలో జరుగుతుందన్నారు. గిరిజన వేష బాషలు, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తారని, కుల దైవం సేవలాల్ మహరాజ్‌కు పూజలు నిర్వహిస్తారన్నారు. డా. బాలు నాయక్, కాంతారావు నాయక్, గోపా నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం రైల్వే వెబ్‌సైట్ ఏర్పాటు

మార్కాపురం: దివ్యాంగులు రైల్వే పాస్ కోసం ఆశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రైల్వే పాస్‌ల కోసం దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడ్డారని ఈ సమస్యను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళటంతో రైల్వే డీఆర్ఎం వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారని, వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయి వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

చిరుధాన్యాలు అంతర్ పంటగా సాగు చేసుకోవాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుధాకర్


మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ


రాగి పంటను పరిశీలిస్తున్న ఏడీ

తాళ్లూరు: ఉద్యాన పంటల్లో చిరుధాన్యాలు అంతర్ పంటగా సాగు చేస్తే బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. నాగంబొట్లపాలెంలో ఉద్యాన పంటలైన జామ, సీతాఫలం సాగు చేసిన చిరుధాన్యం పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. చిరుధాన్యాల సాగుతో నీటి ఎద్దడి ఏర్పడకుండా నెమ్ము ఉంటుందని, అదే విధంగా ఉద్యాన పంటలు చిరుధాన్యాలకు మల్చింగ్ ఏర్పడి కలుపు ఏర్పడదని చెప్పారు. నేలపై పొరల్లోని విలువైన పోషకాలు సేంద్రియ కర్బనం, సూక్ష్మ పోషకాలు సూర్యరశ్మికి ఆవిరై పోకుండా గాలికి, నీటి వేగానికి కొట్టుకుపోకుండా ఉంటుందని చెప్పారు. వీఏఏ శ్రీను పాల్గొన్నారు.

రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

దొనకొండ: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురికిపూడి సుధాకర్ మాట్లాడుతూ ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను అర్హత కలిగిన రైతులకు ఇవ్వాలన్నారు. రైతులు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, పరికరాలు వ్యవసాయశాఖ సబ్సిడీపై అందించాలన్నారు. వ్యవసాయ సలహా మండల చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు పండించిన పంటలను ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్ఓలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడుల కోసం సూచనలు

మార్కాపురం: రబీ సీజన్‌లో ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారు సాగు చేసిన పంటల్లో అధిక దిగుబడి వచ్చేలా సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంటను ఆర్‌బీకే ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 15 లోపు ప్రతి రైతు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. వెటర్నరీ డాక్టర్ లీనాగ్రేస్ మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితుల్లో పశువులు ఉంటే 1962 నంబర్‌కు ఫోన్ చేయాలని, సంచార వాహనం రైతు ఇంటి వద్దకు వచ్చి పశువులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. సలహా మండలి చైర్మన్ పొందుగుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సీజనల్‌గా వచ్చే తెగుళ్ల గురించి వివరించాలన్నారు.

శనగ పంట పరిశీలన

పెద్దారవీడు: మండలంలో గొబ్బూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా శనగ పంటను వ్యవసాయాధికారి బుజ్జిబాయి శుక్రవారం పరిశీలించారు. పెద్దారవీడు, గొబ్బూరులోని రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ శనగ పంటలో వచ్చే పురుగు, తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆర్బీకేలలో బలం మందులు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు తీసుకుని పోవచ్చన్నారు. తైవాన్ స్ప్రేయర్స్, డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, టార్పాలిన్ పట్టలు, నీలం జిగురు అట్టలు, సబ్సిడీతో మంజూరు చేయించాలని అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పొదిలి: కంది పైరు పిందె, కాయ దశలో ఉందని ఆ సమయంలో రైతులు చీడ పీడలు ఆశించకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ సూచించారు. శుక్రవారం బుచ్చనపాలెంలో కంది పైరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

జార్జి విద్యా సంస్థల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: మార్కాపురం జార్జి విద్యా సంస్థల క్యాలెండర్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జార్జి విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైపాలెం, పుల్లలచెరువు మండలాల పార్టీ అధ్యక్షులు కొప్పర్తి ఓబుల రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సొసైటీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, జార్జి విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి


జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె


ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

మార్కాపురం టౌన్: సంక్రాంతి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సంక్రాంతి సంబరాలు అభినందనీయం

దర్శి: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కళాంజలి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం రాత్రి కళాంజలి ఈవెంట్స్ ఆధ్వర్యంలో భరత నాట్యం, బ్యాన్స్, జబర్దస్థ కామెడీ షో నిర్వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. విద్యార్థినులు నిర్వహించిన భరత నాట్యం అలరింపజేసింది. జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ కామెడీ షోలు నిర్వహించి అందరినీ నవ్వించారు. అనంతరం ముగ్గులు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఫ్రిజ్, ఇతర బహుమతులు ప్రదానం చేశారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, బిజ్జం శ్రీనివాసరెడ్డి, నాగార్జునరెడ్డి, పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


కొబ్బరికాయ కొడుతున్న మద్దిశెట్టి శ్రీధర్, ప్రజాప్రతినిధులు

పుల్లలచెరువు: గ్రామాల్లో చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సాయికుమార్ అన్నారు. ఆయన మండలంలోని మల్లాపాలెం జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా పారిశుద్య పనులపై తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ శివలక్ష్మి, కార్యదర్శులు ఉన్నారు.

ముండ్లమూరు: జగనన్న కాలనీలు మంజూరైన వారు వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ కోరారు. వేములలో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లేఔట్‌లో గొల్లపూడి యేసుమరియమ్మ నూతన గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 41 మందికి ఇళ్ల మంజూరు కాగా ఇప్పటికే 15 మంది నిర్మాణాలు ప్రారంభించినట్లు ఏఈ హనుమంతరావు తెలిపారు. మిగిలిన వారు ఈ నెలలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, ఏపీఎం హనుమంతరావు పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులతో డీపీఓ ముఖాముఖి

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న జగనన్న కాలనీలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో లబ్ధిదారులతో ముఖాముఖీగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న కాలనీలు ఎంత వరకు ప్రోగ్రెస్ వచ్చింది, ఎంత మంది ఇళ్లు నిర్మించుకోలేదు, దానికి కారణాలు అధికారులను అడిగి డీపీఓ తెలుసుకునారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ టి.దేవయ్య పాల్గొన్నారు.

మోహన్‌రావుకు బూచేపల్లి పరామర్శ


మోహన్‌రావును పరిమర్శిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఆర్య వైశ్య సంఘ నాయకుడు పానుగంటి మోహన్‌రావును జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు గురువారం రాత్రి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జిల నియామకం


జేసీఎస్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి: జగనన్న సచివాలయ కన్వీనర్లు, సారథుల మండల ఇన్‌చార్జిలను ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ శుక్రవారం నియమించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వారికి బాధ్యతలు అప్పజెప్పి పలు సూచనలు, సలహాలిచ్చారు. దర్శి టౌన్ జేసీఎస్ కన్వీనర్‌గా ఎదురు కోటిరెడ్డి, దర్శి మండల జేసీఎస్ కన్వీనర్‌గా బత్తినేని వెంకటేశ్వర్లు, ముండ్లమూరు మండల జేసీఎస్ కన్వీనర్‌గా మేడికొండ జయంతి, తాళ్లూరు మండల జేసీఎస్ కన్వీనర్‌గా యాడిక శ్రీనివాసరెడ్డి, కురిచేడు మండలం జేసీఎస్ కన్వీనర్‌గా ఎం.సుబ్బారెడ్డి, దొనకొండ మండల జేసీఎస్ కన్వీనర్‌గా గుంటు పోలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ నిబద్ధతతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పదవిని బాధ్యతగా స్వీకరించి పార్టీ అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి సూచించారు.

లోఓల్టేజీ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి: నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యపై విద్యుత్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ డ్యామేజీ అయిన కరెంట్ స్తంభాలను వెంటనే మార్చాలని ఆదేశించారు. దొంగతనాలకు గురైన రైతుల ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవాటిని త్వరితగతిన ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ల కొరతపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ కుళాయిలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, పట్టణంలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. గ్రామాలకు తరలించే తాగునీటి పైపు లైన్‌ల మరమ్మతుల గురించి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి మాట్లాడారు. విద్యుత్ డీఈ కరీం, ఏడీ పిచ్చయ్య, ఏఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి


మల్లాపాలెంలో నాడు నేడు పనులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో సాయికుమార్

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సాయికుమార్ ఆదేశించారు. మండలంలోని మల్లాపాలెం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. పనులు సకాలంలో నాణ్యతతో చేయాలన్నారు. సిబ్బంది కూడా ప్రతి రోజు తనిఖీ చేస్తూ పలు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ముందుగానే నిధులు మంజూరు చేసినా కొన్ని పాఠశాలల్లో పనులు సక్రమంగా జరగడం లేదని అన్నారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎస్సీ పాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్వయంగా పిల్లల బరువులను, ఎత్తులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు మస్టర్లు


రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శీనారెడ్డి

యర్రగొండపాలెం: ఉపాధి పనుల్లో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులు గుర్తించారు. 2020–22 సంవత్సరాల్లో ఎన్ఆర్ఈజీఎస్, ఐటీడీఏ, ఫారెస్ట్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ శాఖలలో 1671 పనులకు రూ 51.74 కోట్ల మేర పనులు చేపట్టారు. మండలంలోని 18 పంచాయతీల పరిధిలో జరిగిన పనులపై ఈనెల 8 నుంచి సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో రెండు సంవత్సరాలపాటు ఖర్చుపెట్టిన నిధులలో 50 శాతం కూడా సద్వినియోగం కాలేదని వారు గుర్తించారు. గొల్లవిడిపిలోని పొలంలో మొక్కలు నాటినట్లు నిధులు డ్రా చేశారని, ఆ పొలంలో మిరప పంట ఉన్నట్లు డీఆర్‌పీ తన రిపోర్టులో పేర్కొన్నాడు. గుర్రపుశాల పంచాయతీలో మరణించినవారి పేర్లతో పేమెంట్ జరిగిందని, పశువుల కుంటలు కొలతల ప్రకారం లేవని వారు ఫిర్యాదు చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శీనారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, అంబుడ్స్‌మెన్ మస్తాన్‌వలి, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.

క్రీడాకారులు సంయమనం పాటించాలి


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ముండ్లమూరు: ఆటల పోటీల్లో పాల్గొనే కబడ్డీ క్రీడాకారులు సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ అన్నారు. మండలంలోని వేములలో శుక్రవారం తృతీయ సంవత్సరం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. క్రీడాకారులు గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. రెండు జిల్లాల నుండి 35 జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

వేములలో నూతన సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వేముల, ఉమామహేశ్వరపురం జట్లు మధ్య హోరాహోరీగా జరిగిన పోటీల్లో వేముల జట్టు విజయం సాధించింది. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మండల జగనన్న సచివాలయ కన్వీనర్ మేడికొండ జయంతి, సొసైటీ అధ్యక్షుడు కుమ్మిత వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లెలమూడి శివయ్య, అంబటి వెంకటేశ్వరరెడ్డి, బైలడుగు కృష్ణ యాదవ్, శాంతకుమార్, దుగ్గినేని వెంకట్, సర్పంచ్‌లు జనమాల నాగేంద్రం పిచ్చయ్య, ఒగులూరి రామాంజి, జమ్ముల గురవయ్య, చొప్పరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గిద్దలూరు రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది పిచ్చయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం భవనం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. రవీంద్రా రెడ్డి, కోర్టు సిబ్బంది మధు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్‌లో పేకాడుతున్న నలుగురు జూదరులను ఎస్ఐ రామకృష్ణ శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.5,820 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని దర్శి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.

షటిల్ పోటీలు ప్రారంభం

గిద్దలూరు రూరల్: సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్ కాలేజీ గ్రౌండ్‌లో శుక్రవారం మాజీ ఎంపీపీ వైఎస్సార్ సీపీ నాయకుడు కడప వంశీధరరెడ్డి షటిల్ పోటీలను ప్రారంభించారు. వెటర్నరీ డా.సాయిచక్రవర్తి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15న పరుగు పందెం పోటీలు

గిద్దలూరు రూరల్: శింగంపల్లెలో పోలేరమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని.. పూర్తి వివరాల కోసం 7993706798, సెల్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

మార్కాపురం టౌన్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను శనివారం పట్టణంలోని నాయుడువీధిలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళికృష్ణ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, పాల్గొంటారన్నారు. విజేతలకు, పాల్గొన్న మహిళలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మొదటి బహుమతిగా వాషింగ్ మిషన్, రెండో బహుమతిగా మైక్రో ఓవెన్, మూడో బహుమతిగా వెట్ గ్రైండర్ అందిస్తామన్నారు.

పశువైద్యశాల తనిఖీ


పాడిపరిశ్రమ షెడ్‌ను పరిశీలిస్తున్న బేబిరాణి

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామీణ పశువైద్యశాలను జిల్లా పశువైద్యాధికారి బేబిరాణి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని షేక్ సుభానీ ఆవుల షెడ్‌ను పరిశీలించి తగిన సూచనలు చేశారు. దాణా, పశుగ్రాస విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నందున ఉపయోగించుకోవాలని కోరారు. రికార్డులు పరిశీలించారు. తూర్పుగంగవరం పశువైద్యాధికారి రాంబాబు, సిబ్బంది పఠాన్ ఖాన్, జేఓలు పాల్గొన్నారు.

జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం

పొదిలి రూరల్: ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. పథకం నిర్వహణలో చోటు చేసుకొనే అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు వేతన దారుల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశాయి. అనుసంధానం ప్రక్రియ ఇప్పటికే 95 శాతం పూర్తి చేసినట్లు ఏపీఓ బుల్లెన్నరావు తెలిపారు. పొదిలి మండలంలోని 17 సచివాలయాల పరిధిలో పొదిలి నగర పంచాయతీతో పాటు 16 పంచాయతీలున్నాయి. మండలం మొత్తం 25024 జాబ్ కార్డులుండగా 18771 జాబ్ కార్డులకు ఆధార్‌కు అనుసంధానం చేసినట్లు ఏపీఓ చెప్పారు. మిగిలిన వాటిలో డబుల్ కార్డులు, వలస వెళ్లిన వారు, చనిపోయిన వారిని తొలగించగా ఇక కేవలం వందలోపు మాత్రమే ఉన్నాయన్నారు. అనుసంధానం చేయడంతో ఒకే పేరున రెండు జాబ్ కార్డులుంటే ఒకటి తొలగించడం, చనిపోయిన వ్యక్తిని, వలస వెళ్ళిన వారిని తొలగించడం జరుగుతుందన్నారు. అక్కచెరువు గ్రామంలో 599 కార్డులు, ఆముదాలపల్లి 1267, అన్నవరం 842, , ఈగలపాడు 659, కంభాలపాడు 1367, కొండాయపాలెం 1044, కుంచేపల్లి 1128, మాదాలవారిపాలెం 549, మల్లవరం 808 ,మూగచింతల 788, నందిపాలెం 335, ఓబులక్కపల్లె 572, పాములపాడు 802, పొదిలి 2704, సూదనగుంట 997, తలమళ్ల703, తుమ్మగుంట 601, ఉప్పలపాడు 1135, జువ్వలేరు 585, ఏలూరు 1286 చొప్పున జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేసినట్లు చెప్పారు.

అర్హులందరికీ పనిదినాలు కల్పించాలి

మార్కాపురం: అర్హులందరికీ ఉపాధి పథకంలో పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ శీనారెడ్డి ఆదేశించారు. శుక్రవారం గోగులదిన్నెలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని జరుగుతున్న ప్రాంతానికి కారు వెళ్లే అవకాశం లేకపోవటంతో ఏపీవో జీవరత్నం ద్విచక్రవాహనంపై అక్కడికి వెళ్ళి కూలీలతో మాట్లాడారు.